RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | ఆదివారం | 03 -03 - 2024
సంపుటి: 1 | సంచిక : 285 | పేజీలు : 4 | వెల : 5/-

## హైదరాబాద్‌లో హై అలెర్ట్



2లో



## వాటర్!

### నీళ్లే.. బీఆర్ఎస్ ప్లాన్

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై దశాబ్దం కావొస్తున్నా- ఉద్యమ కాలం నాటి నీళ్లు, నిధులు, నియామకాలు- నినాదం మార్మోగుతూనే ఉంది. ప్రస్తుతం తెలంగాణలో అధికార, ప్రతిపక్ష నేతల మధ్య వాటర్ వార్ ఓ రేంజ్ కి వెళ్లింది.

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్న సమయంలో తెలంగాణలో రెండు జాతీయ పార్టీల కన్నా ఎక్కువగా ఒత్తిడికి గురవుతోంది భారత రాష్ట్ర సమితి. 2018లో ముందస్తు ఎన్నికలకు వెళ్లడం వల్ల ఎలాంటి ప్లస్ పాయింట్లు ఉంటాయని కేసీఆర్ అంచనా వేసుకున్నారో ఇప్పుడు.. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన మూడు నెలల్లో మళ్లీ పార్లమెంట్ ఎన్నికలు ఎదుర్కోవాల్సి రావడం అంతగా మైనస్ అవుతోంది. ఓ వైపు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి.. మరో వైపు పోటీకి సిద్ధంగా లేని పార్టీ నేతలు, బలమైన అభ్యర్థుల్ని ఎంపిక చేసుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలు ఫలించకపోవడం .. మరితం టెన్షన్‌కు గురి చేస్తున్నాయి. ఈ సమయంలో బలంగా ప్రజల్లోకి వెళ్లడానికి ఓ అజెండా కూడా కరవైంది. కానీ ..తెలంగాణ ఉద్యమంలో కీలకమైన నీళ్ల అజెండాతోనే వెళ్లాలని డిసైడయ్యారు. కాళేశ్వరం విషయంలో తాము చేసిన కృషిని తక్కువ చేస్తున్న ప్రభుత్వ వైఖరిని తప్పు పడుతూ ప్రజల్లోకి వెళ్లాలని డిసైడయ్యారు. తెలంగాణ ఉద్యమం నాటి నినాదమే నేటి ఓట్లనాదమైంది. ఉద్యమ కాలం నాటి నీళ్లు, నిధులు, నియామకాలు- నినాదం మార్మోగుతూనే ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై దశాబ్దం కావొస్తున్నా- ఉద్యమ కాలం నాటి నీళ్లు, నిధులు, నియామకాలు-

మిగతా 2వ పేజీలో...

## గులాబీగుంపు పిరాయింపు

### పార్టీలు మారుతున్న బీఆర్ఎస్ నాయకులు

- ఒక్కరొక్కరుగా 'కారు'ను వీడుతున్న నేతలు
- అవకాశాలు వెతుక్కుంటూ అడుగులు
- గ్రామీణ స్థాయి శ్రేణులు సైతం పక్కచూపులు
- పగ్గాలు తప్పిన పలు పుర, పట్టణ పాలికలు
- ఖాళీ అయ్యే దిశగా గులాబీదళం పరిస్థితులు



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణలో పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ క్రమంగా ఖాళీ అవుతోంది. చేతిలో బెల్లం ఉ న్నంత వరకే ఈగలు.. బెల్లం అయిపోతే ఈగలు ఉండవు అన్న చందంగా బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ఆ పార్టీకి వీర విధేయులుగా ఉన్న వారు కూడా ఇప్పుడు పార్టీ అధికారం కోల్పోవడంతో గుడ్‌బై చెబుతున్నారు. మొన్నటి వరకు అధికార కాంగ్రెస్‌లోకి వలసలు కొనసాగగా, పార్లమెంటు ఎన్నికల వేళ ఇప్పుడు బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి వస్తున్నారు. రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు సిట్టింగ్ ఎంపీలు బీఆర్ఎస్‌ను వీడారు. పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్‌నేత నెల క్రితం బీఆర్ఎస్‌ను వీడారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నూర్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఆయన 2019లో బీఆర్ఎస్‌లో చేరి ఎంపీగా పోటీ చేసి గెలిచారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ ఎస్ అధికారం కోల్పోవడంతో ఆయన తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. ఢిల్లీలో పార్టీ పెద్దల సమక్షంలో హస్తం తీర్థం పుచ్చుకున్నారు తాజాగా రెండు రోజుల క్రితం నాగర్‌కర్నూల్‌కు చెందిన బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ రాములు కూడా బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పా- రు. ఢిల్లీలో బీజేపీ

మిగతా 2వ పేజీలో...

### 'కారు'జారిన నారాయణఖేడ్

మున్సిపల్ పీఠం కాంగ్రెస్ పార్టీ వశం

3లో






## 2 కోట్లకు చేరనున్న హైదరాబాద్ జనాభా

- 7 మున్సిపల్ కార్పొరేషన్లు,
- 30 మున్సిపాలిటీల విలీనం

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** హైదరాబాద్ లోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను విలీనం చేసి ఒకే కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ను.. హైదరాబాద్ గ్రేటర్ సిటీ కార్పొరేషన్ గా ఆవిష్కరించేందుకు సర్కారు ప్రణాళికలు రచిస్తోంది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి సమీక్షలో అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర రాజధాని శివారును ఉన్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను ఒకే వ్యవస్థగా విలీనం చేసేందుకు అధ్యయనం చేయాలని నిర్దేశించారు. ఊఓఆం పరిధిలో ఉన్న 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 30 మున్సిపాలిటీలను హైదరాబాద్ కార్పొరేషన్ లో విలీనం చేసేందుకు కసరత్తు చేయాలని సూచించారు. అన్ని ప్రాంతాలను ఒకేసారి అభివృద్ధి చేసేందుకు విలీనం ఉపయుక్తంగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో 150 డివిజన్లు ఉన్నాయి. కోటికి పైగా జనాభా ఉంది. 7 కార్పొరేషన్లు, 30 మున్సిపాలిటీల్లో దాదాపు 60 లక్షల మంది వరకూ జనాభా ఉంటుందని అంచనా. విలీనం తర్వాత జనాభా 1.80 కోట్ల నుంచి 2 కోట్లకు చేరుకునే అవకాశం ఉంటుందని అధికారులు వేస్తున్నారు. విలీన ప్రాంతాలన్నింటినీ గ్రేటర్ సిటీ కార్పొరేషన్ గా ఒకటిగా ఏర్పాటు చేయాలా.? లేక తూర్పు, పశ్చిమ, ఉత్తర, దక్షిణం ఇలా వేర్వేరుగా 4 సిటీ కార్పొరేషన్లుగా విభజించాలా.? అన్న అంశాన్ని అధ్యయనం చేయాలని సీఎం రేవంత్

మిగతా 2వ పేజీలో...

## కామ్రేడ్స్ దారెటు..



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ నుంచి ఒక్కచోటైన పోటీ చేయాలని వామపక్షాలు పట్టుదలతో ఉన్నాయి. కాంగ్రెస్ కనికరిస్తే కలిసి ఒక్క సీటులో పోటీ చేస్తామని సీపీఐ అంటుంటే.. ఇండియా కూటమిలో భాగమైన తమకు పొత్తులో ఒకసీటు ఇవ్వాలని సీపీఎం అంటోంది. పొత్తు పొడవకపోయిన పోటీ తథ్యమని ఎర్రసైన్యం తెగేసి చెబుతోంది.తెలంగాణ పార్లమెంట్ ఎన్నికల్లో వామపక్షాల పోటీపై ఇంకా క్లారిటీ రావడం లేదు. కాంగ్రెస్‌తో కలిసి వెళ్లాలని సీపీఐ, సీపీఎం భావి స్తున్నా.. పొత్తు చర్చలు మాత్రం పొడవడం లేదు. ఇప్పటికే ఐదు స్థానాలను సీపీఐ పార్టీ కాంగ్రెస్‌కు ప్రతిపాదించి ఏదో ఒక్క సీటు ఇచ్చినా చాలంటూ చెప్పింది. తమ కలయికతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. అదే పంథాలో ఇప్పు డు పార్లమెంట్‌లోనూ కలుపుకొని వెళ్లాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. ఖమ్మం, భువనగిరి, నల్గొండ, పెద్దపల్లి, వరంగల్ స్థానా లను సీపీఐ ప్రతిపాదించింది. ఆయా పార్లమెంట్ స్థానాల్లో తమ బలప్రదర్శనకు ర్యాలీలను సైతం చేయాలని డిసైడ్ అయింది. ఇందులో ఏ ఒక్క సీటు ఇచ్చినా రాష్ట్రమంతా కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తామని సీపీఐ అంటోంది. మరో వామపక్షమైన సీపీఎం కూడా లోక్‌సభ ఎన్నికలకు తగ్గేదేలే అంటోంది. నాలుగైదు స్థానాలను పరిశీలించి బలమున్న ఏదో ఒకచోట పోటీ చేయాలని పార్టీ భావిస్తోంది. ఇటీవల జరిగిన సీపీఎం రాష్ట్ర విస్తృత సమావేశాల్లోనూ దీనిపై చర్చించారు. దేశంలో ఇండియా కూటమిలో

మిగతా 2వ పేజీలో...



## తాగునీటిపై సీతక్క సమీక్ష

**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :** పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మరియు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క శనివారం నాడు గ్రామీణ తాగునీటి సరఫరా పరిస్థితి పై పూర్తిస్థాయి సమీక్ష జరిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తాగునీటి వనరులైనటువంటి రిజర్వాయర్ల వారీగా ప్రస్తుతం ఉన్న నీటి నిలువలపై సమక్షించారు. రిజర్వాయర్లు మరియు నదుల వంటి తాగునీటి వనరుల స్థాయిలను నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని రాష్ట్రంలోని అన్ని మారుమూల గ్రామాలు, ఆవాసాలు, తండాలు, గుడాలకు ప్రతిరోజు తాగునీటి సరఫరా జరిగేలా చూడాలని మంత్రి ఇంజనీర్లను ఆదేశించారు. ప్రత్యేకంగా పూర్వపు అదిలాబాద్, కరీంనగర్ జిల్లాలోని పంపుసెట్ల సమస్యను త్వరితంగా పరిష్కరించి వేసవిలో ఎటువంటి తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని

మిగతా 2వ పేజీలో...

## మల్లారెడ్డికి బిగ్ షాక్

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** మాజీ మంత్రి, మేడ్చల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డికి అధికారులు షాక్ ఇచ్చారు. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీలో హెచ్ఎండీఏ లే అవుట్ లో ఆయనకు సంబంధించిన కాలేజీ రోడ్డును అధికారులు తొలగించారు. ఇక్కడ 2,500 గజాల భూమిని ఆయన ఆక్రమించి రోడ్డు నిర్మించారని ఆరోపణలున్నాయి. దీనిపై గతంలో మేడ్చల్ మల్కాజిగిరి

మిగతా 2వ పేజీలో...



## రాజకీయాలకు గౌతమ్ గంభీర్ గుడ్ బై

**న్యూఢిల్లీ, ప్రభాతసూర్యుడు :** క్రికెటర్, బీజేపీ ఎంపీ గౌతమ్ గంభీర్ లోక్‌సభ ఎన్నికల ముందు సంచలన నిర్ణయం తీసుకున్నారు. రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఈస్ట్ ఢిల్లీ నుంచి ఎంపీగా ఉన్న ఆయన ట్విటర్ వేదికగా ఈ విషయం వెల్లడించారు. క్రికెట్‌పై పూర్తి స్థాయిలో దృష్టి పెడతానని స్పష్టం చేశారు. అందుకే రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు తెలిపారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో పాటు ప్రధాని నరేంద్ర మోదీని ఈ పోస్ట్‌లో ట్యాగ్ చేశా- రు. ఇన్నేళ్ల పాటు ప్రజలకు సేవలు అందించేందుకు అవకాశమిచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. "రాజకీయ విధుల నుంచి తప్పుకునేందుకు అనుమతినివ్వాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాని కోరాను. ఇకపై పూర్తి స్థాయిలో క్రికెట్‌పైనే దృష్టి పెట్టాలనుకుం టున్నాను. ఇన్ని రోజుల పాటు ప్రజలకు సేవలందించేందుకు నాకు అవకాశమిచ్చారు. ఇందుకు ప్రధాని నరేంద్ర మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు. జైహింద్"

- గౌతమ్ గంభీర్, మాజీ బీజేపీ ఎంపీ



RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## అంగన్వాడీలలో సిసి కెమెరాలు, బయో మెట్రిక్ విధానం



**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :** సచివాలయంలో మహిళా, శిశు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సంబంధిత శాఖ అధికారులు హాజరయ్యారు. అంగన్వాడీల్లో గర్భిణీలు, బాలింతలకు సరైన పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సీఎం ఆదేశించారు. అంగన్వాడీల్లో పౌష్టికాహారం దుర్వినియోగం జరగకుండా లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలి. అంగన్వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానం ఏర్పాటును పరిశీలించాలని సూచించారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణాలపై దృష్టిసారించాలని అన్నారు. మొదటి ప్రాధాన్యతగా తీసుకుని భవన నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలో మొబైల్ అంగన్వాడీ కేంద్రాల ఏర్పాటుపై అధ్యయనం చేయాలని అధికారులకు ఆదేశించారు. .

# అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన

**చిన్న శంకరంపేట - ప్రభాతసూర్యుడు :** మహిళలను ఇంటి ఆడపడుచులుగా కాంగ్రెస్ పార్టీ చూస్తుందని ప్రజల కష్టాలు దృష్టిలో పెట్టుకొని మన ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం ద్వారా జీరో కరెంట్ బిల్ హర్షనీయమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. మెదక్ నియోజకవర్గంలోని చిన్న శంకరం పేట మండలంలో ఈజీఎస్ పథకం ద్వారా మంజూరైన జంగరాయ్ మల్లు పల్లి అంబాజీపేట సంకాపూర్ గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మి రెడ్డి, మాజీ సర్పంచ్ లు రాజిరెడ్డి , గడీల సుధాకర్, పార్టీ సీనియర్ నాయకులు ఆవుల గోపాల్ రెడ్డి, శ్రీమాన్ రెడ్డి ,సానే సత్యనారాయణ, మేడి గణేష్, నాయకులు గంగా నరేందర్, మనోజ్ , రమేష్ గౌడ్, జీవన్ ముదిరాజ్, లక్ష్మి శంకరయ్య, బాల కిషన్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



## అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్స్పెక్టర్‌గా అంజిరెడ్డి

**అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు :** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండల పోలీస్ స్టేషన్ నూతన ఇన్స్పెక్టర్ గా బి అంజిరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్లో ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహించిన అంజిరెడ్డి రాచకొండ కమిషనర్ ఆదేశాల మేరకు అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ కు ఇన్స్పెక్టర్ గా బదిలీపై వచ్చారు. కాగా ఇదే పోలీస్ స్టేషన్లో ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహించిన సైదయ్య కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కు బదిలీ అయ్యారు.



## ఆర్టీసీకి జాతీయస్థాయిలో అవార్డులు

**15న ఢిల్లీలో ప్రదానం చేయనున్న ఏఎస్ఆర్టీయూ**

**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ఆర్టీసీ)కి జాతీయ స్థాయి అవార్డుల పంట పండింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్స్ (ఏఎస్ఆర్టీయూ) ప్రతి ఏటా అందించే ప్రతిష్టాత్మక నేషనల్ బస్ ట్రాన్స్‌పోర్ట్ ఎక్స్‌లెన్స్ అవార్డులు సంస్థకు వరించాయి. 2022-23 ఏడాదికి గానూ రహదారి భద్రత, ఇంధన సామర్థ్య నిర్వహణ, సిబ్బంది సంక్షేమం, సాంకేతికత వినియోగం, తదితర కేటగిరిల్లో ఈ జాతీయ స్థాయి పురస్కారాలు టీఎస్ఆర్టీసీకి దక్కాయి.రహదారి భద్రతలో ప్రథమ బహుమతి, ఇంధన సామర్థ్య నిర్వహణ మొఫిషిల్ విభాగంలో ప్రథమ, అర్బన్ విభాగంలో ద్వితీయ బహుమతిని టీఎస్ఆర్టీసీ కైవసం చేసుకుంది. సిబ్బంది సంక్షేమం, ఉత్పత్తి కేటగిరిలో ప్రథమ, సాంకేతికత ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలందించినందుకు గాను మరో ప్రథమ బహుమతిని టీఎస్ఆర్టీసీ గెలుచుకుంది. ఐదు అవార్డులను న్యూఢిల్లీలో ఈ నెల 15న టీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులకు అందజేస్తున్నట్లు ఏఎస్ఆర్టీయూ ప్రకటించింది.టీఎస్ఆర్టీసీ 5 జాతీయ స్థాయి అవార్డులు గెలుచుకోవడం పట్ల రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. సిబ్బంది నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణతో పనిచేయడం వల్లే సంస్థకు ఈ పురస్కారాలు దక్కాయని ఆయన అన్నారు. అవార్డులు వచ్చేలా కృషిచేసిన ఆర్టీసీ అధికారులు, సిబ్బందిని అభినందించారు.నేషనల్ బస్ ట్రాన్స్‌పోర్ట్ ఎక్స్‌లెన్స్ అవార్డులను గెలుచుకోవడంతో ప్రజా రవాణా వ్యవస్థలో టీఎస్ఆర్టీసీ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని సంస్థ ఎండీ వీసీ సజ్జనర్ అన్నారు. సంస్థ అభివృద్ధికి, ప్రయాణికులకు మెరుగైన, నాణ్యమైన సేవలందించేందుకు అధికారులు, సిబ్బంది చేస్తున్న కృషికి ఈ అవార్డులు చిహ్నమని ఆయన తెలిపారు.

## మల్లారెడ్డికి బిగ్ షాక్

మొదటిపేజీ తరువాయి..

ఎంపీగా ఉన్న ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి అప్పట్లో అధికారులకు ఫిర్యాదు చేశారు. తన కాలేజీ కోసమే అప్పట్లో మల్లారెడ్డి రోడ్డు వేసుకున్నారని ఆరోపించారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ భూమి అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ మేరకు హెచ్ఎండీఏ స్థలం ఆక్రమణలపై కలెక్టర్ దృష్టి సారించారు. అక్రమంగా వేసిన రోడ్డును తొలగించాలని అధికారులను ఆదేశించగా.. ఆ రోడ్డును అధికారులు తొలగించారు.అయితే, అధికారులు తన కాలేజీ రోడ్డును తొలగించడంపై మాజీ మంత్రి మల్లారెడ్డి స్పందించారు. తనను కావాలనే కొంత మంది టార్గెట్ చేశారని అన్నారు. ప్రభుత్వం తనపై రాజకీయ కక్ష సాధింపు చర్యలు చేపడుతోందని మండిపడ్డారు. హెచ్ఎండీఏ అధికారుల అనుమతి తీసుకునే అప్పట్లో కాలేజీకి రోడ్డు వేశామని స్పష్టం చేశారు. 2,500 గజాల స్థలానికి ప్రత్యామ్నాయంగా స్థలాన్ని మున్సిపాలిటీకి ఇచ్చామని చెప్పారు. కాలేజ్ రోడ్డు తొలగించడంతో 25 వేల మంది విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బంది పడతారని అన్నారు. ఇకపై తమ కాలేజీ వద్ద ట్రాఫిక్ సమస్య విపరీతంగా పెరిగిపోతుందని పేర్కొన్నారు.

# పాలమూరు సభకు రండి

**సీఎం రేవంత్ కు ఆహ్వానం**

**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :** కాంగ్రెస్ పార్టీ మహబూబ్ నగర్ నుంచి పార్లమెంటు ఎన్నికల ప్రచారం ప్రారంభించినుందని సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి పాలమూరు ప్రజాదీవెన సభతో ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. పాలమూరు ప్రజాదీవెన సభ కోసం సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచంద్ రెడ్డి, ప్రజాప్రతినిధులు సీఎంను ఆహ్వానించారు. మార్చ్ 6 సాయంత్రం 4 గంటలకు మహబూబ్ నగర్ పట్టణంలోని ఎంవిఎస్ కళాశాల మైదానంలో సభ "పాలమూరు ప్రజా దీవెన సభ" జరగనుంది. కొడంగల్ నారాయణ పేట ఎత్తిపోతల ప్రకటనతో పాలమూరులో ఇప్పటికే కాంగ్రెస్ కు అనుకూల పవనాలు వీస్తున్నాయి. ప్రజాదీవెన సభలో ముఖ్యమంత్రి మహబూబ్ నగర్ కు మరిన్ని వరాలు ప్రకటిస్తారనే సమాచారం. సీఎంకు ఆహ్వానం అందించిన వారిలో ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి ముదిరాజ్, జి. మధుసూదన్ రెడ్డి, వేర్లపల్లి శంకర్, అనిరుద్ రెడ్డి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్ తదితరులున్నారు.



# హైదరాబాద్‌లో హై అలెర్ట్

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** బెంగళూరులోని ప్రముఖ రెస్టారెంట్ రామేశ్వరం కేఫ్ లో పేలుడు సంభవించడంతో హైదరాబాద్ పోలీసులు సిటీలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రజల్లో ధైర్యం నింపేందుకు పోలీసులు నగరంలోని రద్దీ ప్రాంతాల్లో వాహన తనిఖీలు, గస్తీ నిర్వహిస్తున్నారు. సిటీలోని రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు, రద్దీ ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించాలని పోలీసు ఉన్నతాధికారులు తమ సిబ్బందిని ఆదేశించారు. బాంబు డిటెక్షన్ స్క్వాడ్ లు స్నిఫర్ డాగ్స్ తో కలిసి నగరంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. నగరంలోని కీలక స్థావరాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు.బెంగళూరు పేలుడు ఘటనతో అక్కడి పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఆర్జీఐ ఎయిర్ పోర్ట్.. రక్షణ స్థావరాలను కాపలా కాస్తున్న సీఐఎస్ఎఫ్ తన భద్రతా యంత్రాంగాన్ని కట్టుదిట్టం చేసింది. తక్కువ తీవ్రత కలిగిన ఇంప్రూవైజ్డ్ ఎక్స్ ప్లోజివ్ డివైజ్ (ఐఈడీ) పేలుడుకు కారణమని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ధృవీకరించారు. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నాం. అది పేలుడు ఎవరు చేశారో తెలియదు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు.. పరిస్థితిని సమీక్షించాలని హోంమంత్రిని కోరాను' అని ఆయన మైసూరులో విలేకరులతో అన్నారు.ఇది భారీ పేలుడు పదార్థం కాదని, బాంబ్ బ్లాస్టేనని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ ఘటనను రాజకీయం చేయొద్దని, మంగళూరులో బీజేపీ ప్రభుత్వ హయాంలో కర్ణాటకలో జరిగిన చివరి పేలుడును సిద్ధరామయ్య గుర్తు చేశారు.



# వాటర్!

మొదటిపేజీ తరువాయి..

నినాదం మార్మోగుతూనే ఉంది. ప్రస్తుతం తెలంగాణలో అధికార, ప్రతిపక్ష నేతల మధ్య వాటర్ వార్ ఓ రేంజ్ కి వెళ్లింది. కాళేశ్వరం ప్రాజెక్టు లోపాలపై కాంగ్రెస్ బీఆర్ఎస్‌ను టార్గెట్‌గా చేసుకొని విమర్శలు చేస్తోంది. ఇప్పుడు అదే ప్రాజెక్టును ఆయుధంగా చేసుకొని హస్తం పార్టీపై కౌంటర్ అటాక్ ప్రారంభించింది గులాబీ పార్టీ. ఇందులో భాగంగా మార్చి 1 నుంచి చలో మేడిగడ్డ కార్యక్రమానికి పిలుపునిచ్చిన బీఆర్ఎస్.. కాళేశ్వరం సమగ్ర స్వరూపాన్ని ప్రజలకు తెలియజెప్పే ప్రయత్నాలు ప్రారంభించింది. ఇదే సమయంలో నీటి పోరు యాత్రలో భాగంగా కరీంనగర్‌లో భారీ బహిరంగ సభకు కూడా ప్లాన్ చేసినట్లుగా తెలుస్తోంది. పార్లమెంటుకు ఎన్నికలు జరగబోతున్న తరుణంలో బీఆర్ఎస్ పార్టీ ప్రాజెక్టుల సందర్శన పేరిట ప్రజాక్షేత్రంలోకి దిగనుంది. బహుశా ఎన్నికలయ్యేంత వరకు ఈ కార్యాచరణ కొనసాగుతుందని అంచనా. కృష్ణా జలాల వినియోగంపై కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగడుతూ ఇటీవల నల్లగొండలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ నిర్వహించింది. కేంద్ర ప్రభుత్వ ఒత్తిళ్లకు తలొగ్గిన కాంగ్రెస్.. కృష్ణా జలాలపై హక్కులను కోల్పోయేలా చేసిందని ఆరోపించింది. ఈ విషయంలో కాంగ్రెస్ వైఖరిని నిరసిస్తూ నీటి పోరు యాత్రలకు పిలుపునిచ్చింది బీఆర్ఎస్. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అత్యంత ప్రతిష్ఠాత్మకంగా కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసింది. అయితే.. ఈ ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ బ్యారేజీ ఎన్నికలకు ముందు కుంగిపోయిన విషయం వెలుగు చూసింది. అప్పటినుంచి రాష్ట్ర రాజకీయాల్లో ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ఈ క్రమంలోనే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ... బీఆర్ఎస్ వైఖరిని ఎండగట్టేందుకు అసెంబ్లీలో సాగునీటి ప్రాజెక్టులపై శ్వేత పత్రం విడుదల చేసింది. 'కాళేశ్వరం ఓ విఫల ప్రాజెక్టు. బీఆర్ఎస్ ప్రభుత్వం వల్లే ఈ పరిస్థితి తలెత్తింది. కాళేశ్వరం బీఆర్ఎస్ అవినీతికి పెద్ద ప్రాజెక్ట్. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజెప్పాలి' అన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో మేడిగడ్డ ప్రాజెక్టును సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి.. బ్యారేజీలోని లోపాలను ఎత్తిచూపారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే మేడిగడ్డ మాత్రమే కాదని, ప్రాజెక్టులో ఇది ఒక బ్యారేజీ మాత్రమేనని చెబుతోంది బీఆర్ఎస్.

## కామ్రేడ్స్ దారెటు..

మొదటిపేజీ తరువాయి..

కాంగ్రెస్‌తో కలిసి భాగస్వామిగా ఉన్నందున ఇక్కడ కలిసిపోటీ చేసే అవకాశం తమకు ఇవ్వాలని మార్క్సిస్ట్ పార్టీ అంటోంది.ఒక్క స్థానం కేటాయిస్తే మిగిలిన స్థానంలో ఇండియా కూటమి నుంచి బరిలో ఉన్న అభ్యర్థులకు సీపీఎం మద్దతు ఉంటుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. భువనగిరి, ఖమ్మం, నల్గొండ స్థానాల్లో సీపీఎం అడుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో సీపీఎం పొత్తు కుదరకపోవడంతో ఒంటరిగా సీపీఎం పోటీ చేసి పరాజయం పాలైంది. ఈసారి చివరి నిమిషం వరకు ఎదురు చూసి ఒక్కసీటు కూడా ఇవ్వకపోతే పోటీ చేయాలని సీపీఎం భావిస్తోంది. ఒంటరిగా బరిలో దిగినా ఒక్క స్థానంలోనే పోటీ చేసి మిగిలిన స్థానాల్లో యథావిధిగా ఇండియా కూటమి పార్టీలకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించారు. వామపక్షాలతో లోక్‌సభ ఎన్నికల్లో పొత్తుపై కాంగ్రెస్ మాత్రం నోరుమెదపడం లేదు. జాతీయ స్థాయిలోనే చర్చలు జరుగుతాయని రాష్ట్ర నేతలు చెబుతున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో లోక్ సభ సీట్లకు బాగా డిమాండ్ ఉండటంతో లెఫ్ట్ పార్టీలకు సీట్లు కేటాయించడం కాంగ్రెస్‌కు కష్టతరంగా మారింది. వరంగల్, ఖమ్మం సీట్లలో ఏదైన ఒకటి దక్కొచ్చని కామ్రేడ్లు ఆశలు పెట్టుకున్నారు.

# 2 కోట్లకు చేరనున్న హైదరాబాద్ జనాభా

మొదటిపేజీ తరువాయి..

అధికారులను ఆదేశించారు. కాగా, హెచ్ఎండీఏ పరిధిని అన్ని వైపులా ఔటర్ రింగ్ రోడ్డు వరకూ విస్తరించాలని ఇటీవల సమీక్షలో నిర్దేశించారు. జీహెచ్ఎంసీతో పాటు కొత్తగా ఏర్పడ్డ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో డివిజన్లకు నిధుల పంపిణీలో అసమానతలున్నాయనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం కొన్ని డివిజన్లలో లక్ష మందికి పైగా జనాభా ఉంటే, మరికొన్ని కార్పొరేషన్లలో డివిజన్లలో 30 వేల మంది మాత్రమే ఉన్నారు. మౌలిక వసతుల కల్పనకు నిధులు, గ్రాంట్లను ఒకే తీరుగా కేటాయిస్తే ఆయా ప్రాంతాల అభివృద్ధి ఒకే తీరుగా జరుగుతుందనేది అధికారుల అంచనా. నగర విస్తరణకు అనుగుణంగా శివారు ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు, ఇతర వాటి కోసం భారీగా నిధులు వెచ్చించాలని వారు సీఎం దృష్టికి తెచ్చారు. ఈ క్రమంలో నూతనంగా ఏర్పాటు చేసే కార్పొరేషన్ పరిధిలో అన్ని డివిజన్లకు జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేయాలని.. దీనిపై అధ్యయనం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. దాదాపు సమాన జనాభా ఉండేలా డివిజన్లను ఏర్పాటు చేయాలని.. నియోజక వర్గాల సరిహద్దులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని భావిస్తున్నారు. అందుకు అవసరమైన పునర్విభజన ప్రక్రియపై అధ్యయనం చేయాలని సూచించారు. దేశ రాజధాని ఢిల్లీలో రెండేళ్ల కిందట అక్కడి 3 మున్సిపల్ కార్పొరేషన్లను ప్రభుత్వం ఒకే కార్పొరేషన్ గా విలీనం చేసింది. అక్కడ అనుసరించిన విధానాలను సీఎం అధికారులను అడిగి తెలుసుకున్నారు.కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పాలక వర్గాల పదవీ కాలం పూర్తైన వెంటనే వాటికి ప్రత్యేకాధికారులను నియమించాలని, అన్నింటి పదవీ కాలం ముగిసిన తర్వాతే ఈ విలీన ప్రక్రియ ప్రారంభించాలని సీఎం రేవంత్ అధికారులతో సమాలోచనలు చేశారు. జీహెచ్ఎంసీతో పాటు బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్ నగర్, బండ్లగూడ జాగీర్, నిజాంపేట, బడంగ్ పేట, మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. వాటితో పాటు 30 మున్సిపాలిటీలు హెచ్ఎండీఏ పరిధిలో ఉన్నాయి. వాటి పాలకవర్గాల పదవీ కాలం మరో ఏడాది ఉంది. ఆ తర్వాతే ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు.




## తాగునీటిపై సీతక్క సమీక్ష

మొదటిపేజీ తరువాయి..

చీఫ్ ఇంజనీర్లను ఆదేశించారు. పైపులైన్లు పగిలిపోయిన లీకైన వెంటనే వాటిని సరిదిద్దు నీటి సరఫరాను అదే రోజు పునరుద్ధరించాలి ఈ విషయంలో ఎటువంటి ఆలస్యం ఉండకూడదని ఆదేశించారు. ముఖ్యమంత్రి స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ లో తాగునీటి అవసరాల నిమిత్తం ప్రతి నియోజకవర్గంలో ఒక కోటి రూపాయలు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మిషన్ భగీరథ ఇంజనీర్లు క్షేత్రస్థాయి అవసరాలను గమనించి జాగ్రత్తగా వినియోగించుకోవాలని వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని గౌరవ మంత్రివర్యులు సూచించారు. ఈ వేసవిలో తరచూ సమీక్షలు నిర్వహించాలని చీఫ్ ఇంజనీర్లను ఆదేశించారు. చీఫ్ ఇంజనీరింగ్, సూపరింటెండింగ్ ఇంజనీర్లు మరియు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించి తాగునీటి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలి. మండల స్థాయి మిషన్ భగీరథ ఇంజనీర్లు పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకోవాలని అన్నారు.

## గులాబీగుంపు పిరాయింపు

మొదటిపేజీ తరువాయి..


తెలంగాణ ఇన్‌చార్జి తరుణ్ చుగ్ సమక్షంలో ఢిలీలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. దేశ ఖ్యాతి, వికసిత భారత్ లక్ష్యాన్ని, పేదరిక నిర్మూలన కోసం మోదీ చేస్తున్న పని చూసి బీజేపీలో చేరుతున్నానని రాములు తెలిపారు.జహీరాబాద్ ఎంపీ బీబీ.పాటిల్ కూడా బీఆర్ఎస్‌కు షాక్ ఇచ్చాడు. పార్టీకి గుడ్ బై చెప్పారు. పాటిల్ తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014, 2019 ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఎంపీగా పోటీచేసి గెలిచారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడంతో ఆయన పార్టీకి దూరంగా ఉంటూ వస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం పార్టీకి రాజీనామా చేసి జాతీయ పార్టీ బీజేపీలో అధ్యక్షుడు జేపీ నడ్డా సమక్షంలో చేరారు.వరుసగా సిట్టింగ్ ఎంపీలు బీఆర్ఎస్‌ను వీడడం ఆ పార్టీని ఆందోళనకు గురిచేస్తోంది. ఒకవైపు వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు గెలుస్తాని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. మరోవైపు ఒక్క సీటైనా గెలిచి చూపించాలని సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఛాలెంజ్ విసిరారు. ఇంకోవైపు బీఆర్ఎస్ ముగిసిన అధ్యాయమని బీజేపీ నేతలు పేర్కొంటున్నారు. రానున్న రోజుల్లో మరో ఇద్దరు బీఆర్ఎస్ ఎంపీలు కూడా పార్టీ వీడుతారని తెలుస్తోంది. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి ముందువరుసలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. వలసలు ఇలాగే కొనసాగితే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అభ్యర్థులు కూడా దొరకరన్న ప్రచారం జరుగుతోంది.

ఆదివారం | 03 మార్చి 2024 | 3

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# ఇక యాదగిరి గుట్టే



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** యాదాద్రి కాదు ఇకపై యాదగిరిగుట్టగా పిలువబుడుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. యాదాద్రి పేరును యాదగిరి గుట్టగా మారుస్తూ త్వరలోనే జీఓ విడుదల చేస్తామని కోమటిరెడ్డి వెల్లడించారు. ఆయన శనివారం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'ఎమ్మెల్యే కేటీఆర్ ఇప్పటికీ తండ్రి కేసీఆర్ చాటు కొడుకే. నేను ఉద్యమాలు చేసి వచ్చాను. మేం జీరో బిల్ ఇచ్చినట్టు.. కేటీఆర్‌కి జీరో నాలెడ్జ్ ఉంది. నాలెడ్జ్ లేని కేటీఆర్ గురించి మాట్లాడడం వృథా. ఫ్లోర్ లీడర్ ఇవ్వకపోతే హరీష్ కూడా బీజేపీ లోకి పోతాడు. కాళేశ్వరం కట్టిన చీఫ్ డిజైనర్ కేసీఆర్ మేడిగడ్డ ఎందుకు పోలేదు?. కాళేశ్వరం పనికిరాదని ఎన్‌డీ ఎస్‌ఏ రిపోర్ట్ ఇచ్చింది. ప్రజలే కేసీఆర్‌ను నామరూపాలు లేకుండా చేశారు. ఎంపీ అభ్యర్థులపై అంతర్గత సర్వే జరుగుతోంది. భువనగిరి నుండి పోటీ చేయమని రాహుల్ గాంధీని కోరాను.

# ఇంకొకటి కారు జారే...




**మెదక్, ప్రభాతసూర్యుడు :** లంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, రాష్ట్ర వ్యాప్తంగా పురపాలక సంఘాలు కాంగ్రెస్ పరం అవుతున్నాయి. పురపాలక సంఘాల్లో అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టి పెట్టి, ఆపై తమ బలం నిరూపించుకుని కాంగ్రెస్ పార్టీ సొంత పాలకవర్గాలను ఏర్పాటు చేస్తోంది. ఈ క్రమంలోనే సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పురపాలక సంఘం కాంగ్రెస్ పార్టీ సొంతం చేసుకుంది. బుధవారం నిర్వహించిన ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ కి చెందిన ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్‌గా దారం శంకర్ ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించిన డిప్యూటీ కలెక్టరు వసంత కుమారి ప్రకటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, స్థానిక ఎమ్మెల్యేగా కాంగ్రెస్ చెందిన సంజీవరెడ్డి గెలవడంతో నారాయణఖేడ్ లో రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. నారాయణ ఖేడ్ పురపాలక సంఘంలో ఉన్న మొత్తం 15 మంది కౌన్సిలర్లలో, బిఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో ఆ పార్టీ కి మద్దతు ఇస్తున్న కౌన్సిలర్ల సంఖ్య 11కు చేరింది. కాంగ్రెస్ పార్టీ అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇవ్వగా, ఫిబ్రవరి 2న ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గి భారాసకు చెందిన ఛైర్పర్సన్ రుబీనా బేగం, వైస్ చైర్మన్ పరశురాం పదవులు కోల్పోయారు. ఎన్నిక కోసం నిర్వహించిన సమావేశానికి ఎనిమిదిమంది కాంగ్రెస్, కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించిన బిఆర్ఎస్‌కు సంబంధించిన ముగ్గురు కౌన్సిలర్లు, ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఉన్న స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిపి మొత్తం 12 మంది హాజరయ్యారు. చైర్మన్, వైస్ చైర్మన్ సంబంధించి ఒక్కో దరఖాస్తు రావడంతో, వారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు అధికారులు ప్రకటించారు. దీంతో పురపాలిక బిఆర్ఎస్ చెయ్యిజారి హస్తగతమైంది. ఆందోల్ నియోజకవర్గం రాయికోడు మండల ఎంపీపీ ఎన్నికల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి . ఎంపీపీ గా ఉన్న వెంకట్రావు మృతి చెందడంతో ఈరోజు కొత్త ఎంపీపీ కోసం ఎన్నిక జరిగింది .ఎంపీపీ స్థానాన్ని ఎలాగైనా దక్కించుకోవాలని మంత్రి దామోదర రాజనరసింహ బీఆర్ఎస్ పార్టీ కి చెందిన ఇటిక్యాపల్లి ఎంపీటీసీ పండరిని మంగళవారం రోజు కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకున్నారు. ఎంపీపీగా ఇస్తామంటూ ఆశ చూపి పండరి అనే వ్యక్తిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోగా ఈరోజు జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపిటిసి లంతా కాంగ్రెస్ పార్టీకి చెందిన రెబల్ అభ్యర్థి ఎంపీటీసీ మొగులప్పను ఎంపీపీగా ప్రతిపాదించి కాంగ్రెస్ పార్టీకి జలక్ ఇచ్చారు .అధికార పార్టీకి అనుకూలంగా ఓటు వేయించుకోవాలని బీఆర్ఎస్ ను చీల్చాలని అధికార పార్టీ చేసిన కుట్రలను బీఆర్ఎస్ పార్టీ ఎంపీటీసీలు భగ్నం చేశారు. తమ పార్టీతో గెలిచి తమకే ద్రోహం చేసిన పండరిని ఎంపీపీగా చేసే ప్రసక్తే లేదంటూ రెండు రోజులుగా మాజీ ఎమ్మెల్యే కాంతి కిరణ్ మండల నాయకుల బస్వరాజ్, సిద్దన్న , విట్టల్ లతో సమాలోచనలు చేశారు.

# డీకే వర్సెస్ జితేందర్ రెడ్డి

**మహబూబ్ నగర్, ప్రభాతసూర్యుడు :** పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతున్నా కొద్దీ పాలమూరు పార్లమెంట్ నుంచి పోటీ చేసే బీజేపీ అభ్యర్థిగా ఎవరు అనే అంశంపై ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా రసవత్తర చర్చలకు తెరలేపుతోంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి పేరు ఇప్పటికే ఖరారు కావడంతో ఇప్పుడు అందరి దృష్టి బీజేపీపై పడింది. బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎవరు రంగంలో ఉండనున్నారనే అంశం కన్నా అభ్యర్థి పైననే చర్చలు ఎక్కువగా సాగుతున్నాయి.

ఈ ఎన్నికల్లో ఎలాగైనా టికెట్ దక్కించుకుని ఎన్నికల పోరులో నిలవాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్ ఆశిస్తున్నారు. రాష్ట్ర, జాతీయ సాయి నేతలతో ఉన్న పరిచయాలతో టిక్కెట్ సాధించుకోవాలని ఎత్తులకు పైఎత్తులు వేసుకుంటున్నారు. ప్రజలకు చేరువ అయ్యేందుకు డీకే అరుణ, జితేందర్ రెడ్డి, శాంత కుమార్ ప్రయత్నాలు సాగిస్తున్నారు. రెండు నెలలుగా ఆయా నియోజకవర్గాలలో పర్యటనలు చేసి పార్టీ క్యాడర్‌ను బలోపేతం చేయడంతో పాటు.. పలు కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ ఆదేశాల మేరకు ప్రారంభించిన బస్సుయాత్రలో ముగ్గురూ పాల్గొంటున్నారు. టికెట్ ఎవరికి వస్తుందనే





అంశంలో పార్టీ శ్రేణులు అంచనాకు రాలేకపోతున్నారు. డీకే అరుణ గత పార్లమెంట్ ఎన్నికలలో పోటీ చేసి గణనీయమైన సంఖ్యలో ఓట్లను సాధించారు. ఈసారి ఎన్నికల్లో తనకు గెలిచే అవకాశాలుంటాయని గట్టిగా చెబుతున్నారు. ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్ రెడ్డి మాత్రం ఎన్నికలలో టికెట్ తనకు వచ్చే ఎన్నికల్లో ఇవ్వాలన్న ఒప్పందంతోనే చేరిన విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ మహబూబ్‌నగర్ అసెంబ్లీ స్థానం నుంచి తన కుమారుడిని పోటీలో ఉంచానని, ఇప్పుడు తనకు తప్పనిసరిగా అవకాశం ఇవ్వాలని అధిష్టానంపై ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏ విషయం చెప్పకపోవడంతో అసంతృప్తికి గురై ఆయన ట్వీట్లు పెడుతున్నారు. టికెట్ ఎవరికి ఇవ్వాలనే అంశం అధిష్టానానికి తలనొప్పిగా మారే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. కాగా, అభ్యర్థి ఎవరనే అనే అంశం తేలడానికి మరో వారం, పది రోజులు పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. టిక్కెట్ కోసం పోటీ పడుతున్న వారంతా బలమైన నేతలు కావడంతో హైకమాండ్ కూడా రిస్క్ తీసుకోవాలని అనుకోవడం లేదు.

# మల్లికార్జున ఖర్గే, జైరాం రమేశ్‌కు నోటీసులు



**న్యూ డిల్లీ - ప్రభాతసూర్యుడు :** కాంగ్రెస్ నేతలకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ లీగల్ నోటీసులు పంపారు. ఓ ఇంటర్వ్యూలో తాను మాట్లాడిన మాటలకు సంబంధించిన వీడియోను వక్రీకరించి ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేశారంటూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సీనియర్ నేత జైరాం రమేశ్ లకు నితిన్ గడ్కరీ లీగల్ నోటీసులు పంపించారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఓ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో 19 సెకన్ల క్లిప్పింగ్‌ను కాంగ్రెస్ పార్టీ 'ఎక్స్' వేదికగా షేర్ చేసింది. గ్రామస్థులు, పేదలు, కూలీలు, రైతులు సంతృప్తికరంగా లేరు. గ్రామాల్లో మంచి రోడ్లు లేవు, తాగునీరు, మంచి ఆసుపత్రులు, పాఠశాలలు అందుబాటులో లేవు అంటూ గడ్కరీ వీడియోలో అన్నారు. అయితే, కాంగ్రెస్ షేర్ చేసిన ఆ వీడియో క్లిప్‌పై గడ్కరీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వ హయాంలో తీసుకుంటున్న చర్యల గురించి తాను చేసిన ప్రసంగాన్ని వక్రీకరించి కాంగ్రెస్ పార్టీ ఈ పోస్ట్ పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సందర్భం ఉద్దేశాన్ని బయటపెట్టకుండా అర్థం మారేలా ఆ క్లిప్పింగ్‌లో మార్పులు చేశారని మండిపడ్డారు. ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు, నన్ను కించపరిచేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నించారని అన్నారు. ఈ మేరకు తన లాయర్ ద్వారా ఖర్గే, జైరాం రమేశ్‌కు లీగల్ నోటీసులు పంపినట్లు చెప్పారు. నోటీసులు అందిన 24 గంటల్లో ఆ వీడియో క్లిప్‌ను డిలీట్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మూడు రోజుల్లో తనకు రాతపూర్వకంగా క్షమాపణలు చెప్పాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

# తెలంగాణకు 175 ఎకరాల రక్షణ భూమి

**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :** తెలంగాణకు ప్రధాని మోదీ తీపి కబురు అందించింది. కేంద్ర రక్షణ శాఖ 175 ఎక రాల రక్షణ శాఖ భూమిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వా నికి బదిలీ చేసింది. దీంతో రోడ్లు, ఎలివేటర్ కారిడార్ల నిర్మాణంలో ఇబ్బందులు తొలగను న్నాయి. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందాయి. ఈ ప్రతిపాదన లకు అనుగుణంగా కేంద్రం అనుమతులు ఇచ్చింది. ఈ ఏడాది జనవరి 5న తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ విషయాన్ని కేంద్ర వైద్యా రోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలంగాణ సీఎంవో తెలిపింది. . ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు రక్షణ శాఖ పరిధిలోని భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని కోరగా కేంద్ర రక్షణ శాఖ సానుకూ లంగా స్పందించిందని సీఎంఓ వివరించిది. తమ అభ్యర్థనపై సాను కూలంగా స్పందించిన ప్రధాని మోడీ, రక్షణ మంత్రి రాజ్నాథ్సింగ్లకు సీఎం రేవంత్రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు..

# వంద రోజుల్లో 6 గ్యారంటీలు అమలు చేయాల్సిందే

## ఎంపి బండి సంజయ్



**హుజూరాబాద్ - ప్రభాతసూర్యుడు :** జమ్మికుంట మండలం శాయంపేటలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. ప్రజాహిత యాత్రకు ప్రజల నుండి అనూహ్య స్పందన లభిస్తోంది. ఎక్కడికి వెళ్లినా మోదీకే ఓటేస్తామని చెబుతున్నారు. దేశవ్యాప్తంగా బీజేపీకి 350కిపైగా ఎంపీ సీట్లు వస్తాయి. తెలంగాణలో 17కు 17 ఎంపీ సీట్లు గెలుచుకుంటామనే నమ్మకం ఉంది. ఈనెల 4, 5 తేదీల్లో ప్రధానమంత్రి సభలో పాల్గొనేందుకు వెళుతున్నా. ఈనెల 8, 9 తేదీల్లో శివరాత్రి సందర్భంగా ప్రజాహిత యాత్రకు విరామం. ఇచ్చిన మాట మేరకు వంద రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేసి తీరాల్సిన బాధ్యత కాంగ్రెస్ పై ఉంది. తెల్ల రేషన్ కార్డు ఉన్నా...రూ.500లకు గ్యాస్ సిలిండర్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలులో కోత పెడుతున్నరు. 90 లక్షల రేషన్ కార్డు కుటుంబాలుంటే... 50 లక్షల కుటుంబాలకు కోత పెట్టడం అన్యాయమని అన్నారు. ప్రతినెలా ఉద్యోగులకు జీతాలివ్వకుంటే వాళ్లతో కలిసి సర్కార్ ను నిలదీస్తూనే ఉంటాం. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కై దొంగాట ఆడుతూ ప్రజలను మభ్యపెడుతున్నయ్. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, అక్రమాలు జరిగాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కాగ్, విజిలెన్స్ సంస్థలు తేల్చినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు ? అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్ సైతం 6 గ్యారంటీల హామీల అమలు కోసం నిలదీయలేకపోతోంది. హైదరాబాద్ నుండి కరీంనగర్, రామగుండం రహదారిపై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్రం రక్షణ భూములివ్వడం హర్షణీయం. రాజకీయాలను పక్కనపెట్టి అభివృద్ధిపై దృష్టి పెడితే కేంద్రం ఏ విధంగా సహకరిస్తుందో ఇదే నిదర్శనం. గత బీఆర్ఎస్ సర్కార్ కేంద్రాన్ని తిట్టడానికే పరిమితమైందే తప్ప ఏనాడూ అభివృద్ధిపై దృష్టి పెట్టలేదు. ఇకనైనా కేంద్రాన్ని, మోదీని తిట్టడం మానుకుని ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి. గత ప్రభుత్వం మాదిరిగా కాంగ్రెస్ ఆరోపణలకే పరిమితమైతే తెలంగాణ ప్రజలు నష్టపోతారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం పూర్తిగా సహకరించేందుకు సిద్ధంగా ఉంది. 10 ఏళ్లలో తెలంగాణలో దాదాపు రూ.10 లక్షల కోట్లకుపైగా నిధులిచ్చింది. కేంద్రంలో మోదీని మళ్లీ ప్రధానిని చేస్తే శక్తివంతమైన భారత్ రూపుదిద్దుకుంటుంది. భూదాన్ భూముల పేరుతో బోయినపల్లి వినోద్ కుమార్ కుటుంబ అక్రమాలు నిజమని అన్నారు. గతంలో నేను ఈ అంశంపై ఆరోపణలు చేసిన మాట నిజం. ఆంధ్రజ్యోతి కథనంపై విచారణ జరిపి తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్సిందే. రాష్ట్ర ప్రభుత్వం కోరితే కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరిపించేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. విచారణ పేరుతో కాంగ్రెస్ జాప్యం చేస్తూ 6 గ్యారంటీల అమలు అంశాన్ని పక్కదోవ పట్టిస్తున్నారని అన్నారు.



# రామేశ్వరం కేఫ్ కేసు వేగవంతం

**బెంగళూరు - ప్రభాతసూర్యుడు :** కర్ణాటక బెంగళూరు రామేశ్వరం కేఫ్ బ్లాస్ కేసులో పోలీసు దర్యాప్తులో వేగం పెంచారు. ఈ కేసులో నలుగురిని పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ బృందం కేసును దర్యాప్తు చేస్తుందని పోలీస్ వర్గాలు పేర్కొన్నాయి. బృందం ధార్వాడ్, హుబ్లీ, బెంగళూరుకు చెందిన నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. రామేశ్వర్ కేఫ్‌లో జరిగిన ఐఈడీ పేలుడు ఘటనపై దర్యాప్తు వేగంగా కొనసాగుతుందని బెంగళూరు నగర కమిషనర్ బీ దయానంద్ పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసు బృందాలు రంగంలోకి విచారణ జరుపగా.. పలు ఆధారాలు లభించాయి. బెంగళూరులోని రామేశ్వరం కేఫ్‌లో జరిగిన పేలుడు ఘటనలో పంది మంది గాయపడ్డ విషయం తెలిసిందే. పేలుడు ఘటనపై బెంగళూరు కమిషనర్ పలు కీలక సూచనలు చేశారు. కేసు సున్నితత్వం, భద్రతా సమస్యలను దృష్టిలో పెట్టుకొని మీడియా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యంగా కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. శుక్రవారం జరిగిన పేలుడు ఘటనకు సంబంధించి బెంగళూరు పోలీసులు చట్టవ్యతిరేక కార్యకలాపాల చట్టం, పేలుడు పదార్థాల చట్టం కింద కేసు నమోదు చేశారు.

# అధికారం అడ్డుపెట్టుకుని రూ.65 లక్షలు అవినీతి



**ఆదిలాబాద్, ప్రభాతసూర్యుడు :** ఇందు కలదు.. అందు లేదు అన్నట్లు తయారైంది అవినీతి. ప్రభుత్వం వేతనాలు ఇస్తున్నా.. కొంతమంది సైడ్ ఇన్‌కమ్‌పైనే ఆధారపడుతున్నారు. ఇటీవలే గిరిజన ఆశ్రమ పాఠశాల అధికారిని లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుపడ్డారు. తాజాగా మరో మహిళా అధికారిని కూడా అక్రమాల కేసులో ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. చిన్న పిల్లలకు సరఫరా చేయాల్సిన పాలు, పాల ప్యాకెట్లను దారి మళ్లించినందుకు 8 ఏళ్ల తర్వాత అరెస్ట్ చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని జైనూర్ మండలంలో 2015-16లో ఐసీడీఎస్ సీడీపీవోగా శ్రీదేవి పనిచేసింది. పిల్లల కోసం కేటాయించిన పాలు, పాలప్యాకెట్లను దారి మళ్లించినట్లు అప్పట్లోనే అధికారులు గుర్తించారు. శాఖాపరమైన విచారణ చేపట్టారు. 322 అంగన్‌వాడీ కేంద్రాల్లో గిరిజన పిల్లలకు సరఫరా చేయాల్సిన పాలు, పాల ప్యాకెట్లను ఆమె మంచిర్యాలలోని చాక్లెట్, ఐస్‌క్రీమ్ ఫ్యాక్టరీలకు అమ్మేసి సొమ్ము చేసుకున్నట్లు గుర్తించారు. దీంతో ఈ కుంభకోణం వెలికితీసే బాధ్యతను అధికారులు ఏసీబీకి అప్పటించారు. విచారణ జరిపిన ఏసీబీ అధికారులు అవకతవకలు నిజమే అని నిర్ధారించారు. పాలు, పాలప్యాకెట్లు దారి మళ్లించడం ద్వారా రూ.65.78 లక్షల అవినీతికి పాల్పడినట్లు ధ్రువీకరించారు. 2022లోనే విచారణ పూర్తి చేసిన ఏసీబీ శ్రీదేవి అరెస్ట్‌కు అనుమతి ఇవ్వాలని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కోరారు. అయితే సదరు అవినీతి అధికారికి నాటి బీఆర్ఎస్ పాలకులు బాసటగా నిలిచారు. అరెస్టుకు అనుమతి ఇవ్వలేదు. దీంతో కేసులో పురోగతి ఆగిపోయింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అవినీతి అధికారులపై కొరడా ఝుళిపిస్తోంది. ఈ క్రమంలో శ్రీదేవి అరెస్టుకు అనుమతి ఇచ్చింది. దీంతో ఆమెపై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# మోడీ సభ ఏర్పాట్లపై సమీక్ష



సంగారెడ్డి - ప్రభాతసూర్యుడు : సంగారెడ్డి జిల్లా పటాన్చెరు పట్టణంలో ఈనెల 5వ తేదీన భారత ప్రధాని నరేంద్రమోడి సభను పురస్కరించుకొని బిజెపి రాష్ట్రస్థాయి నాయకుల సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు, ప్రధానమంత్రి సభకి లక్ష మంది జనాలను క్రోడీకరించాలని జనాలకు ఎలాంటి సౌకర్యం కలగకుండా అన్ని రకాల వసతులు కల్పించి సభను విజయవంతం చేయాలని తెలుపునిచ్చారు, ఈ కార్యక్రమం లో రాజస్థాన్ రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్ జి, బిజెపి మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ బసవ లక్ష్మీ నరసయ్య, మాజీ మంత్రి ఈటెల రాజేందర్, దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు, సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, తదితర బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## సంపాదకీయమ్..

# గాలికే ప్రజాఆరోగ్య భద్రత

తినే తిండి, పీల్చేగాలి, తాగేనీరు సురక్షితంగా, నాణ్యంగా, ఆరోగ్యకరంగా ఉండాలని కోరుకోని వారుండరు. మనిషికి కనీస అవసరాలైన ఇందులోని ఏ ఒక్కటి కల్తీ అయినా అది ప్రాణాలకే ప్రమాదం..ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న నిత్యావసర వస్తువులను కృత్రిమంగా తయారు చేసి.. కల్తీని ప్రజలకు విక్రయిస్తున్నారు. మరోపక్క నగరంలోని హోటళ్లలో కూడా కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తున్నారు. కల్తీ ఆహారపదార్థాల బారిన పడి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నా.. అధికార యంత్రాంగం నిద్ర మత్తులో ఉన్నదని విమర్శలొస్తున్నాయి. నకిలీ కొబ్బరి నూనె, మసాల, కిరాణా సరకులకు సంబంధించిన గుట్టును రట్టు చేశారు. కానీ, స్వార్థమే పరమావధి, లాభాలే అసలైన లక్ష్యంగా మారిన సమాజంలో సర్వం కల్తీమయం చేస్తున్నారు కొందరు ప్రబుద్ధులు. ఆహారపదార్థాల్లో ఉపయోగించే మాసాల దినుసుల్లోని గసగసాలు, మిర్యాలు, లవంగాలు, డ్రైఫ్రూట్స్, పిండి, బియ్యం.. అన్ని రకాల వస్తువులు నకిలీవి చేస్తున్నారు. మానవాళికే ప్రమాదకరంగా మారిన ఈ కల్తీని సమర్థవంతంగా నిరోధించి, కల్తీసురుల ఆటకట్టించే చట్టాలే కరువయ్యాయి. కోటికి పైగా జనాభా వున్న హైదరాబాద్‌లో గడిచిన రోజు ఓ అంతర్జాతీయ ప్రముఖ కంపెనీ చాక్లెట్‌లో తెల్లపురుగు వుందని నాచారంలోని రాష్ట్ర ఆహార ప్రయోగశాల నిర్ధారించడం, బేగంబజార్ కేంద్రంగా రూ. 5 లక్షలు విలువ చేసే అల్లం, వెల్లుల్లి కల్తీ పేస్టు ముఠాను పట్టుకోవడం సర్వం కల్తీమయాన్ని నిరూపిస్తున్నది. నేషనల్ క్రైమ్స్ బ్యూరో ఇటీవల 19 నగరాల్లో ఆహార నాణ్యతపై తనిఖీలు చేయగా హైదరాబాద్ దేశంలోనే 246 కేసులతో అగ్రస్థానంలో నిలిచిందని, ఇది దేశ వ్యాప్త కేసుల్లో 84 శాతమని బ్యూరో గణాంకాలతో సహా ప్రకటించడం ఆరోగ్యరంగ నిపుణులను ఆందోళనపరుస్తోంది. ఇంటి బయట ఏది తినాలన్నా కల్తీ భయం సాధారణ ప్రజలను తీవ్రంగా కలవరపరుస్తున్నది. అత్యధిక జనసాంద్రత, వేలాది హోటళ్ళున్న హైదరాబాద్‌లో ఆహార కల్తీని నిరోధించే అధికారులు కేవలం 30 మంది మాత్రమే ఉన్నారంటే నియంత్రణ పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సర్వం కల్తీతో పాలితులు కల్తీ ఆహారం తిని కడుపు సంబంధిత వ్యాధులు, కేన్సర్, డయాబెటిస్, గుండె వైఫల్యం, పెరాలసిస్ వంటి సుదీర్ఘ జబ్బులతో బాధితులుగా మారినా పాలకుల్లో ఆహార కల్తీ నియంత్రణపై చీమకుట్టినట్లయిన లేకపోవడం, అధికారులు మౌన ప్రేక్షకుల్లా మూగనోము పాటించడం క్షమించరాని నేరమే.

2006లోనే ఆహార భద్రత, ప్రమాణాల చట్టం తీసుకు వచ్చినా అది కాగితాలకే పరిమితమైంది. వీధి ఆహార దుకాణాల నుంచి ఫైవ్ స్టార్ హోటళ్ళ దాకా కల్తీసురులు చట్టంపై భయంలేక విశృంఖలంగా వీరవిహారం చేస్తున్నారు.సహజ సిద్ధంగా పొలాల్లో పండిన పంటల నుంచి వచ్చే ఆహార పదార్థాలను తినడం వల్ల ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. అయితే, ఈ సహజ సిద్ధంగా పండే పంటల నుంచి వచ్చే ఆహారపదార్థాలు కాకుండా.. కొందరు కృత్రిమంగానే తయారు చేస్తున్నారు. ఇందుకు కొన్ని కెమికల్స్‌ను ఉపయోగిస్తున్నారు, హైడ్రోజన్ ఫెరాక్సైడ్ వంటి కెమికల్స్‌ను కలిపి.. ఈ నకిలీ వస్తువులు తయారు చేస్తున్నారు. జిలకర్ర, సాజిర, బాదం, లవంగాలు, ఇలాచీలు, గసగసాలు, మిర్యాలు, కర్రం పొడి, పసుపు, గోదుమ పిండి, నూడిల్స్.. ఇలా ఒకటేమిటి ఇంటిలోని వంట గదిలో ఉండే ఆహార పదార్థాల తయారీకి ఉపయోగించే వస్తువులన్నీ నకిలీవి తయారు చేస్తున్నారు. మేమున్నామంటూ.. అప్పుడప్పుడు పోలీసులు దాడులు చేస్తుంటారు. ఏడాదికోసారి ఫుడ్‌సేఫ్టీ అధికారులు కూడా.. మేం సైతం అంటూ దాడులు చేస్తుంటారు. పూర్తిస్థాయిలో మాత్రం అటు పోలీసులు, ఇటు ఫుడ్‌సేఫ్టీ అధికారులు చర్యలు తీసుకోవడంలేదన్న విమర్శలున్నాయి. రాజస్థాన్, గుజరాత్ నుంచి వచ్చిన వాళ్లే కృత్రిమంగా నకిలీ పదార్థాలు తయారు చేస్తూ.. విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్టు తయారీకి వాడిన నాసిరకం ముడిపదార్థాలు, వాటికి రంగు, రుచి, వాసన రావడానికి వాడిన కెమికల్స్, అవి తయారైన పరిసరాల పరిశుభ్రతను పరిశీలిస్తే ఒళ్ళుగగుర్పొడుస్తోంది. కల్తీ తయారీదారులు అల్లం, వెల్లుల్లి పేస్టును బ్రాండ్ల పేరు, ఐఎస్ఐ ముద్రతోనే రాష్ట్ర వ్యాప్తంగా పేరున్న స్టోర్లకు కూడా పంపిణీ చేస్తున్నారని పోలీసులు చేసిన ప్రకటన చూస్తే వణికిపోని వారుండరంటే అతిశయోక్తి కాదు. పాలు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, వెన్న, మయోనీజ్, సాస్, కోవా, బియ్యం, చాక్లెట్లు లాంటి నిత్యావసర వస్తువుల నాణ్యతపై హైదరాబాద్ నగర పాలక సంస్థ ఆహార కల్తీ నిరోధక విభాగానికి ప్రతి రోజూ వందలాది ఫిర్యాదులు అందుతున్నాయంటే కల్తీ తీవ్రత ఎంతగా విస్తృతమవుతున్నదో అర్థం చేసుకోవచ్చు. ఆహార కల్తీని కూడా విధాన నిర్ణేతలు ప్రాధాన్యతా అంశంగా తీసుకొని వివిధ దేశాల్లో ఆదర్శప్రాయంగా వున్న చట్టాలను అక్కడి మాదిరిగా సంస్కరించి కఠిన శిక్షలు కల్తీసురులకు పడే విధంగా చూస్తే తప్ప కల్తీల ఆగడాలు ఆగవు. ఆహార కల్తీ చట్టం, అందులో భాగంగా ఏర్పాటైన యంత్రాంగాలు వీధివీధినా పెరిగిన ఆహార కేంద్రాలను ఎప్పటికప్పుడు నిఘా పెట్టి తనిఖీ చేసే పరిస్థితులు లేవు. పాలకులే మేల్కొని ఆహార కల్తీ నిరోధాన్ని అత్యవసరంగా తీసుకొని అందుకు తగిన కఠిన కార్యాచరణ అవలంబిస్తే తప్ప కల్తీ మహమ్మారిని పారద్రోలలేము.

ఇప్పుడు సరైన యంత్రాంగం లేక అక్కడక్కడా, అప్పుడప్పుడూ ఆహార కల్తీ నిరోధక అధికారులు చేసే తనిఖీలు, పెట్టే కేసులు తూతూ మంత్రంగానే వున్నాయి. ఎక్కడా కేసులు పెట్టకపోవడం, పెట్టినా శిక్షలు నామమాత్రంగా కూడా లేకపోడవడంతో కల్తీ అనేది కుటీర పరిశ్రమగా మారింది. లాభమే తప్ప మనిషి ఆయుష్షుని పట్టించుకోని పరిస్థితి సర్వత్రా నెలకొన్నది. అభివృద్ధి చెందిన దేశాల్లో ఇంటి బయట ఉత్పత్తి అయ్యే ప్రతి పదార్థం లోని వాటిని ముడి పదార్థాలు, వాటి వల్ల ఆరోగ్యానికి సంభవించే లాభనష్టాలు లాంటివి పకడ్బందీగా ప్యాకింగ్‌లోనే ముద్రిస్తారు. ఆహార చట్టాల ఉల్లంఘనను తీవ్రంగా పరిగణించి శిక్షలు కూడా త్వరిత గతిన పడేలా యంత్రాంగాలను ఏర్పాటు చేశారు. దీనితో అక్కడ కల్తీకి కొంత ముకుతాడు పడింది. కాని ఆ చిత్తశుద్ధి ఇక్కడ లేకపోడం ప్రజల పాలిట ప్రాణాంతకంగా మారింది.

# వాచ్‌మెన్‌కు 3 ప్రభుత్వ ఉద్యోగాలు

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : పట్టుదలతో ప్రయత్నిస్తే... ఏదైనా మన సొంతం అవుతుందని నిరూపించాడు మంచిర్యాల జిల్లాకు చెందిన ప్రవీణ్ అనే యువకుడు. నైట్ వాచ్‌మెన్‌గా పని చేస్తూనే... ఏకంగా మూడు ప్రభుత్వ ఉద్యోగాలను సంపాదించాడు. తాజాగా వెల్లడించిన గురుకుల ఫలితాల్లో టీజీటీ, పీజీటీతో పాటు జూనియర్ లెక్చరర్ ఉద్యో గానికి కూడా ఎంపికయ్యాడు. ఇప్పుడు ప్రవీణ్ ప్రస్థానం... సోషల్ మీడియాలో తెగ వైరల్ గా మారింది. ప్రవీణ్ కు నెటిజన్లు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. సూపర్ బ్రదర్ అంటూ పోస్టులు చూస్తున్నారు. ప్రవీణ్‌ది మంచిర్యాల జిల్లా జన్నారం మండలం పొన్కల్ గ్రామం. ఓయూ క్యాంపస్‌లో ఎంకాం, బీఈడీ, ఎంఈడీ పూర్తి చేశాడు. ప్రవీణ్ తల్లిదండ్రులు స్వగ్రామంలో పని చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. తండ్రి మేస్త్రీ పని.. తల్లి బీడీ కార్మికులు. వారికి భారం కావొద్దని భావించిన ప్రవీణ్.. ఓయూ క్యాంపస్‌లో ఉన్న ఈఎంఆర్సీలో నైట్ వాచ్‌మెన్‌గా చేరాడు. గత ఐదేళ్లుగా అక్కడ పని చేస్తూనే ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్నాడు. ఎలాంటి కోచింగ్ లేకుండానే సొంతంగానే ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర్ అయ్యాడు. యూట్యూబ్‌లోని కంటెంట్‌ను సేకరిస్తూ తన సాధనకు మరింత పదును పెట్టాడు. గురుకుల ఉద్యోగాలకు దరఖాస్తు చేసిన ప్రవీణ్... ఏకంగా మూడు ఉద్యోగాలకు ఎంపికై తనకు తానే సాటి అని చాటిచెప్పాడు.

# జహీరాబాద్ కోసం భారీ పోటీ

మెదక్, ప్రభాతసూర్యుడు : జహీరాబాద్ సీటును దక్కించుకోవాలని చూస్తున్నారు పలువురు బీజేపీ నేతలు పావులు కదుపుతున్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ కొట్టాలని చూస్తున్న బీజేపీ లోక్ సభ ఎన్నికలకి సిద్ధం అవుతుంది. ము1ఖ్యంగా తెలంగాణ పై బీజేపీ స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఇప్పటికే పార్టీ అగ్రనేతలు పలు మార్లు ఇక్కడి బీజేపీ నేతలతో సమావేశం అయ్యి పార్లమెంట్ ఎన్నికల వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సారి ఎలాగైనా తెలంగాణలో అత్యధికంగా ఎంపీ సీట్లు గెలవాలని బీజేపీ ప్లాన్ వేస్తుంది. ఇందులో భాగంగానే సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ పార్లమెంట్ స్థానంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇక్కడి నుండి పోటీ చేయడానికి చాలామంది ఆశావహులు ఉన్నారు.ఎంపీ టికెట్ కోసం బీజేపీ పార్టీలో తీవ్రమైన పోటీ ఉంది. జహీరాబాద్ నుంచి బీజేపీలో ఆరుగురికి పైగా టికేట్ ఆశిస్తున్నారట. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్న ఈ లోక్ సభ నియోజకవర్గ పరిధిలో సంగారెడ్డి జిల్లాలో జహీరాబాద్, అందోలు, నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి, కామారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో లోక్ సభ పరిధిలో ఉన్న ఏడింటిలో 4 కాంగ్రెస్, రెండు ఃఖీూ, ఓ అసెంబ్లీ సీటు బీజేపీ గెలుచుకుంది. అయితే ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి పెరిగి ఓటు శాతంతో కాషాయం పార్టీ నేతలు ఉత్సాహం పెరిగిందట.దీనికి తోడు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చరిష్మా, అయోధ్యలో రామాలయం ప్రారంభం తదితర అంశాలు కలిసొచ్చే అవకాశం ఉందని, పార్టీ లీడర్లు భావిస్తున్నారట. దీంతో జహీరాబాద్ నుంచి బీజేపీ తరఫున పోటీ చేసేందుకు ఆ పార్టీ నేతలు ఇంట్రెస్ట్ చూపుతున్నారట. అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్పరిధిలోని కామారెడ్డిలో బీజేపీ విజయం సాధించింది..అయితే తెలంగాణలో ఫలితాలు ఎలా ఉన్నా జహీరాబాద్ ఎంపీ స్థానం గెలుపు పై బీజేపీ నేతలు



ఎవరి లెక్కలు వాళ్ళు వేసుకుంటు న్నారట. ఈసారి జహీరాబాద్ నియోజకవర్గాన్ని తామే కైవసం చేసుకుంటా మని బీజేపీ నేతలు నమ్ముతున్నారట.అయితే టికెట్ ఆశించేవారి సంఖ్యనే పెరుగుతుండటంతో పార్టీకి ఇబ్బం దిగా ఉందట. మరోవైపు మాజీ కేంద్ర మంత్రి దివంగత నేత ఆలే నరేంద్ర కొడుకు, ఆలే భాస్కర్, మాజీ ఎంపీ బాగారెడ్డి కుమారుడు జైపాల్ రెడ్డి, నిజామాబాద్ కి చెందిన సైంటిస్ట్ పైడి ఎల్లారెడ్డి, బోధన్ కి చెందిన బీజేపీ నేత మెడపాటి ప్రకాష్ రెడ్డి ఎంపీ సీటు కోసం పోటీ పడుతున్నారట. అలాగే గత ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసిన బాణాల లక్ష్మా రెడ్డి ఈసారి జహీరాబాద్ నుంచి ఎంపీ టికెట్ రేసులో ఉన్నామని ప్రచారం చేసుకుంటున్నారట. కాగా తాజాగా మరో పేరు తెరపైకి వచ్చింది. సినీ నిర్మాత దిల్ రాజు కూడా ఇక్కడి నుండి బీజేపీ పార్టీ తరుపున పోటీలో ఉంటారన్న ప్రచారం జరుగుతోంది.బీజేపీ పార్టీకి గతంలో కంటే ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కువ ఓట్లు తెచ్చుకుంది. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఎక్కువగా లింగాయత్ సామాజిక వర్గం ఉండటంతో తమకే ఆ ఓట్లు వస్తాయని బీజేపీ పార్టీ నేతల నమ్మకమట. దీనికి తోడు మైనారిటీలు కూడా ఎక్కువగా ఉండటంతో వారి ఓట్లు చీలి బీజేపీ గెలుస్తుందని లెక్కలు వేసుకుంటున్నారట. పైగా ఎవరి స్థాయిలో వాళ్ళు గల్లీ నుంచి ఢిల్లీ వరకు పైరవీలు చేసుకుంటున్నారట.మరో వైపు జహీరాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ ఇన్‌చార్జిగా కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని నియమించింది. మాజీ ముఖ్య మంత్రి కే చంద్రశేఖర్ రావు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలను ఓడించి బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణ రెడ్డి గెలవడంతో, ఈయన జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఆయా నియోజకవర్గాల్లో, మండలాల్లో మీటింగ్లు నిర్వహిస్తూ, క్యాడర్‌ను సమాయత్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఇక్కడ పోటీకి ఆశావహుల సంఖ్య పెరిగింది. జహీరాబాద్ లోక్ సభ స్థానం.. కర్ణాటక, మహారాష్ట్రకు బోర్డర్ లో ఉండటం కూడా కొంతమేరకు బీజేపీకి కలిసి వస్తుందంటున్నారు రాజకీయ విశ్లేషకులు. మరి ఇంత పోటీ ఉన్న ఈ పార్లమెంట్ స్థానంలో బీజేపీ ఎంపీ అభ్యర్థిగా అదిష్టానం ఎవరిని ప్రకటిస్తుందో వేచి చూడాలి..!

# అమల్లోకి 'గృహ జ్యోతి' పథకం

## లబ్ధిదారులకు జీరో కరెంట్ బిల్

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : రాష్ట్ర ప్రభుత్వం 6 గ్యారెంటీల అమల్లో భాగంగా రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత కరెంట్ 'గృహజ్యోతి' అమలుకు సిద్ధమైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో శుక్రవారం నుంచి గృహజ్యోతి పథకం అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. తెల్లరేషన్ కార్డు ఉండి.. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారిని ఈ పథకాలకు ప్రభుత్వం అర్హులుగా పేర్కొంది. 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడకం ఉన్న అందరికీ ఈ నెల జీరో కరెంట్ బిల్లు వస్తుంది. హైదరాబాద్ పరిధిలోని లబ్ధిదారులకు జీరో కరెంట్ బిల్లు జారీ చేశారు. ఈ మేరకు బిల్లింగ్ సాఫ్ట్ వేర్ లో ఇప్పటికే మార్పులు చేశారు. కొత్త బిల్లింగ్ యంత్రాలను సైతం కొనుగోలు చేశారు. ఈ జీరో బిల్లులో లబ్ధిదారుడు వాడిన యూనిట్లు, బిల్లు ప్రింట్ చేసి.. గృహజ్యోతి సబ్సిడీ కింద మొత్తం బిల్లును మాఫీ చేసి జీరోగా చూపిస్తారు. టెస్టింగ్ కోసం జీరో బిల్లులు జారీ చేశామని.. తొలుత నగరంలో చేసి త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా జీరో బిల్లులు జారీ చేస్తామని విద్యుత్ అధికారులు తెలిపారు. ఫిబ్రవరి నెల ఖాతాలను ముగించి.. మార్చి వివరాలను బిల్లింగ్ యంత్రాల్లో లోడ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఒకవేళ, లబ్ధిదారులు 200 యూనిట్ల కంటే ఒక్క యూనిట్ అధికంగా వాడినా తప్పనిసరిగా బిల్లు చెల్లించాల్సిందేనని అధికారులు స్పష్టం చేశారు.గృహజ్యోతికి అర్హులైన వారు.. 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడి, తెల్ల రేషన్ కార్డు ఉండి కూడా జీరో కరెంట్ బిల్లు రాకపోతే ఆందోళన చెందాల్సిన పని లేదని ప్రభుత్వం సూచించింది. మున్సిపల్, మండల కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది.




రేషన్ కార్డు, దానికి లింక్ చేసిన ఆధార్, గృహ విద్యుత్ కనెక్షన్ నెంబరును సంబంధిత దరఖాస్తుతో సమర్పించాలని పేర్కొంది. విద్యుత్ సిబ్బంది వీటిని పరిశీలించిన అనంతరం అర్హుల జాబితాలో పేరు చేరుస్తారని వెల్లడించింది. ఆ తర్వాత నెల నుంచి జీరో కరెంట్ బిల్లు వస్తుందని స్పష్టం చేసింది. ఈ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించింది.అలాగే, పట్టణాలు, నగరాల్లో ఇళ్లు అద్దెకు ఇచ్చిన యజమానులకు ఆందోళన అనవసరమని అధికారులు తెలిపారు. యజమానుల పేరున ఉన్న గృహ కనెక్షన్ అద్దెకు ఉండే వారి పేరు మీద మార్పు చెందదని.. అద్దెకున్న వారిని దరఖాస్తు చేసుకోవద్దని ఒత్తిడి చెయ్యాల్సిన అవసరం లేదని అన్నారు. వారికి రేషన్ కార్డు ఉండి.. 200 యూనిట్ల వరకూ విద్యుత్ వినియోగిస్తే దరఖాస్తు చేసుకోనివ్వాలని సూచించారు.ప్రజాపాలనలో ఉచిత విద్యుత్ కోసం 81.54 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 49.50 లక్షల ఇళ్లకు కరెంట్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 19.85 లక్షల మంది మాత్రమే పథకం కోసం అప్లై చేశారు. కాగా, ఈ నెలలో జారీ అయిన జీరో కరెంట్ బిల్లుల ఆధారంగానే అర్హుల సంఖ్యపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అయితే, ప్రస్తుతం విద్యుత్ ఛార్జీల ప్రకారం లెక్కిస్తే నెలలో కచ్చితంగా 200 యూనిట్లు వాడుకునే ఇంటికి దాదాపు రూ.900 ఆదా కానున్నట్లు తెలుస్తోంది.

# రామేశ్వరం కేఫ్‌లో ధృవీకరించని వ్యాఖ్యలు చేయరాదు

బెంగళూర్ - ప్రభాతసూర్యుడు : బెంగళూర్‌లోని రామేశ్వరం కేఫ్‌లో పేలుడు ఘటనకు సంబంధించి ధృవీకరించని వ్యాఖ్యలు చేసి దర్యాప్తును ప్రభావితం చేసేలా కర్నాటక మంత్రులు వ్యవహరించరాదని కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. దర్యాప్తును ప్రభావితం చేసేలా ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా మంత్రులను నిలువరించాలని సీఎం సిద్ధరామయ్య, బెంగళూర్ పోలీస్ కమిషనర్‌లకు కేంద్ర మంత్రి విజ్ఞప్తి చేశారు. గ్యాస్ సిలిండర్ పేలడం వల్లే పేలుడు జరిగిందని, రాజకీయ శత్రుత్వమే ఇందుకు కారణమని పేర్కొనడం వంటి రాష్ట్ర మంత్రుల ప్రకటనలు దర్యాప్తును ప్రభావితం చేస్తాయని కేంద్ర మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు.ఊహాగానాలకు దూరంగా ఉండాలని బెంగళూర్ పోలీస్ కమిషనర్ బి దయానంద మీడియాకు చేసిన వినతి నేపథ్యంలో కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఈ వ్యాఖ్యలు చేశారు. రామేశ్వరం కేఫ్ ఘటనకు సంబంధించి దర్యాప్తు వేగవంతంగా సాగుతోందని, పలు బృందాలు దీనిపై పనిచేస్తున్నాయని, కేసు సున్నితత్వం, భద్రతా ఆందోళనల దృష్ట్యా మీడియా ఊహాగానాలు వ్యాప్తి చేయకుండా సహకరించాలని కమిషనర్ ట్వీట్ చేశారు.మరోవైపు ఈ ఘటనను రాజకీయం చేయవద్దని విపక్షాలకు కర్నాటక సీఎం సిద్ధరామయ్య విజ్ఞప్తి చేశారు. ఇక ఈ ఘటనకు సంబంధించి లేటెస్ట్ సీసీటీవీ ఫుటేజ్ బయటకు వచ్చింది. పేలుడు అనుమానితుడు పేలుడు పదార్థాలతో కూడిన బ్యాగ్‌తో కేఫ్ వైపు నడుచుకుంటూ వెళుతున్న దృశ్యాలు కనిపించాయి. అనుమానితుడు యువకుడని అతడి వయసు 28 నుంచి 30 ఏండ్లు ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215